సంక్షేమమేది..?

అర్హులకు అందని ప్రభుత్వ పథకాలు

- లోపభూయిష్టంగా లబ్ధిదారుల ఎంపిక
- పథకాల మంజూరుపై ప్రజల అసంతృప్తి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు, రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పథకాల అమలులో అవకతవకలు జరిగాయని, కాలయాపన చేస్తున్నారని విమర్శిస్తున్నారు. అర్హత ఉన్నప్పటికీ పథకాలు అందుతాయో.. లేదోనని ఆందోళన చెందుతున్నారు.


మత్కేపల్లి గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న లబ్ధిదారులు (ఫైల్)

చింతకాని: రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు మండల వ్యాప్తంగా మొత్తం 7,279 మంది గ్రామసభల్లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను ఎప్పుడు పరిశీలిస్తారు.. ఎప్పటికి పథకాలను అందజేస్తారని ప్రభుత్వ తీరును విమర్శిస్తున్నారు. రుణమాఫీని పూర్తిగా చేయలేని ప్రభుత్వం యాసంగి సీజన్‌కు అయినా రైతుభరోసా నగదును వస్తుందని ఆశించినా నిరాశే మిగిలిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతు భరోసా..

మండల వ్యాప్తంగా ఉన్నటువంటి 38,124 ఎకరాల విస్తీర్ణంలో.. 256 ఎకరాలు సాగుకు యోగ్యం కాదని వ్యవసాయాధికారులు గుర్తించారు. కావున 37,868 ఎకరాలకు రైతుభరోసా నగదు రైతుల ఖాతాల్లో జమ చేయాలి. అయితే ప్రభుత్వం మొదటగా పైలెట్ ప్రాజెక్ట్ కింద రేపల్లెవాడ గ్రామాన్ని ఎంపిక చేసి.. ఆ గ్రామ రెవెన్యూ పరిధిలోని 409మంది రైతులకు రైతు భరోసా నగదు వారి ఖాతాల్లో జమచేశారు. దీంతో మిగిలిన రైతులు, కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు రుణమాఫీ ఎలాగో పడలేదు.. కనీసం రైతు భరోసా అయినా వస్తుందేమోనని ఎదురు చూసిన రైతులకు నిరాశే మిగిలింది.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా..

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి మండల వ్యాప్తంగా 580 మంది అర్హులని గ్రామసభల్లో చదివిన జాబితాలపై అవకతవకలు ఉన్నాయంటూ పెద్ద ఎత్తునా ప్రజలు ఆందోళన చేశారు. రైతు కూలీలందరికీ ఈ పథకాన్ని అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. గతేడాది కనీసం 20 రోజులు ఉపాధి పనికి వెళ్లిన వారికే భరోసా ఇస్తామని చెప్పటం మోసం చేయటమేనని కూలీలు ఆవేదన వెలిబుచ్చారు. ఆత్మీయ భరోసా పథకానికి గ్రామసభల్లో 2,060 మంది కూలీలు దరఖాస్తు చేసుకున్నారు.

రేషన్ కార్డులు..

మండల వ్యాప్తంగా రేషన్‌కార్డుల కోసం గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 1,313 దరఖాస్తుల్లో విచారణ చేసి 1,160 దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తించి గ్రామసభలో జాబితాను చదివారు. ఏళ్ల తరబడి రేషన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్న కొంతమందికి రాకపోవటంతో గ్రామసభలో అధికారులను నిలదీశారు. గ్రామసభలో మండల వ్యాప్తంగా రేషన్‌కార్డుల కోసం 2,529 మంది మళ్లీ దరఖాస్తు చే సుకున్నారు. పథకాలకు రేషన్‌కార్డు కూడా ప్రామాణికం కావటంతో దరఖాస్తులను త్వరితగతిన విచారణ జరిపి కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు..

మండల వ్యాప్తంగా సొంత స్థలం ఉన్న 2,436 మందికి ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక చేసినట్లు అధికారులు చెప్పటంతో.. ఎంపిక చేసిన తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. ప్రజాపాలన, కులగణన సర్వే ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం గ్రామసభల్లో 2,560మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఇల్లు మంజూరు చేయాలి..



చుట్టూ పరదాలు కట్టుకుని రేకులు వేసుకున్న ఇంట్లో ఉంటున్నాను. సెంటు భూమి లేని తన కుటుంబం కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో మా పేరు రాలేదు. అధికారులు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి.

– అయితం శ్రీను, తిరుమలాపురం

మరోమారు పరిశీలించాలి..



ఆత్మీయ భరోసా పథకం జాబితాలో అవకతవకలు ఉన్నాయి. అర్హులను ఎంపిక చేయలేదు. ఉపాధిహామీ పనికి వెళ్లి సెంటు భూమిలేని మా కుటుంబాన్ని ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేయలేదు. ఆత్మీయ భరోసా జాబితాలను మరోమారు పరిశీలన చేయాలి.

– బండెల శ్రావణి, కొదుమూరు

రైతు భరోసా ఇవ్వలేదు..



ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన రుణమాఫీ, రైతుభరోసా పథకాలపై రైతుల్లో అసంతృప్తి ఉంది. రుణమాఫీ పూర్తిగా చేయకపోగా వానాకాలం రైతుభరోసా ఇవ్వలేదు. కనీసం యాసంగిలోనైనా ఎప్పుడు ఇస్తారోలేదోనని సందేహంలో ఉన్నాం.

– పగడాల పుల్లయ్య, మత్కేపల్లి

క్లుప్తంగా

పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలి

సత్తుపల్లిటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు పీఎల్, ఈఎస్ఐలను సక్రమంగా అమలు చేయాలని కోరుతూ.. తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. అనంతరం మేనేజర్ మైసా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా నాయకుడు ఎ.శరత్, పి.రవి, పుల్లారావు, కాంతమ్మ, నాగమ్మ, అర్జున్‌రావు, సాంబ పాల్గొన్నారు.

సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ బదిలీ

– నూతన కమిషనర్‌గా నర్సింహ


నర్సింహ

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబుపై బదిలీ వేటు పడింది. ఆయన స్థానంలో సీడీఎంఏలో వెయిటింగ్‌లో ఉన్న నర్సింహ వస్తున్నట్లు తెలిసింది. కాగా, కమిషనర్‌గా రవిబాబు గతేడాది ఫిబ్రవరి 15న బాధ్యతలు చేపట్టారు. పాలనలో ఆయన తనదైన మార్క్ చూపించలేకపోయారనే విమర్శలు వచ్చాయి. ఈనేపథ్యాన వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తున్న అధికార పార్టీ నాయకులు.. రవిబాబును బదిలీ చేయించినట్లు సమాచారం.

మార్కెట్‌లోకి హీరో న్యూడెస్టినీ 125


వాహనాన్ని విడుదల చేస్తున్న కమిషనర్

మధిర: మధిరలోని శ్రీ సంధ్య మోటార్స్ హీరో షోరూంలో న్యూడెస్టినీ 125 వాహనాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ వాహనాన్ని మున్సిపల్ కమిషనర్ ఏ.సంపత్ విడుదల చేయగా వాహనం ప్రత్యేకతలను షోరూం అధినేత లక్కిరెడ్డి సుధాకర్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో షోరూం ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్లీనరీని విజయవంతం చేయాలి


ఏన్కూరు: మార్చి 2న ఖమ్మంలో నిర్వహించే తెలంగాణ జనసమితి ప్లీనరీని జయప్రదం చేయాలని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు కోరారు. గురువారం ఏన్కూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ అకాంక్షలైన నిధులు, నియమకాలు, నీళ్ల కోసం పోరాడి తెలంగాణను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిదన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు బాబు, నర్సింహారావు, మోహన్, వినోద్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


బాధిత కుటుంబానికి ఎల్ఓసీ అందజేస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కారేపల్లి: కార్యకర్తలకు అండగా ఉంటామని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన పచ్చిపాల సైదులు అనారోగ్యానికి గురికావటంతో హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. కాగా.. చికిత్స నిమిత్తం రూ.2లక్షలు అవుతాయని వైద్యులు తెలపటంతో.. వైరా ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల ఎల్ఓసీని అందజేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


ప్యాడ్లు, ఇతర సామగ్రి అందిస్తున్న సంస్థ నిర్వాహకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వేచ్ఛ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ కార్యదర్శి డాక్టర్ చల్లా కోటయ్య పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ భానుచందర్, హెచ్‌ఎంలు జ్యోతి, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కల్లూరు: కల్లూరుకు చెందిన మిషన్ భగీరథ కార్మికుడు సిద్ధం రవికుమార్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. తోటి కార్మికులు గురువారం రవికుమార్‌కు రూ.12 వేలు ఆర్థిక సాయం అందించారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత


మాట్లాడుతున్న ఎంవీఐ వరప్రసాద్

ఎర్రుపాలెం: రోడ్డు భద్రత అందరి బాధ్యత అని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండలకేంద్రంలోని సరస్వతీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాహనదారులు ప్రమాదాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, టూ వీలర్ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఫోర్ వీలర్ నడిపే వాళ్లకు సీటు బెల్టు తప్పనిసరి సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సదస్సులో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర, అధ్యాపకులు నాగిరెడ్డి రమేష్, మిర్యాల శ్యాంప్రసాద్, నాగిరెడ్డి సౌజన్య, ఎర్రబోలు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రణాళిక


కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్థానికులతో అధికారులు

వైరారూరల్: రానున్న వేసవిలో ఎక్కడ కూడా విద్యుత్ సమస్య ఎదురుకాకుండా ప్రణాళిక రూపొందించి అమలుచేస్తున్నామని విద్యుత్ శాఖ డీఈ బండి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని గన్నవరంలో ఏర్పాటుచేసిన 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ కిరణ్‌కుమార్, రూరల్ ఏఈ పాలేటి వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు


మధిర: ఎస్సీ కాలనీలో..


కల్లూరు: గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మధిర/ సత్తుపల్లి/ కల్లూరు/ తల్లాడ/ వేంసూరు: అసత్య ప్రచారాలతో సాధ్యంకాని 420 హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 420 రోజులు అయిందని బీఆర్‌ఎస్ నాయకులు విమర్శించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు గురువారం మధిర పట్టణంలోని ఎస్సీ కాలనీలోని, సత్తుపల్లిలోని ఉన్న మహాత్మా గాంధీజీ విగ్రహాలకు బీఆర్‌ఎస్ నాయకులు వినతిపత్రాలు అందించారు. అదే విధంగా కల్లూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. తల్లాడ గ్రామ పంచాయతీ కాంప్లెక్స్ ఎదురుగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేసి గాంధీ చిత్రపటానికి వినతిపత్రం అందించారు. అదే విధంగా వేంసూరులో మహాత్మాగాంధీ విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, నాయకులు ఉమామహేశ్వరరావు, రామారావు, రఘు, అంకమరాజు, నర్సింహారావు, కాంతారావు, అనీల్, వెంకటేశ్వరరావు, అజయ్‌కుమార్, ప్రసాద్, వీరమోహన్‌రెడ్డి, శ్రీనివాసరావు, దాసురావు, వెంకట్‌లాల్, జీవీఆర్, వెంకటరెడ్డి, మహేశ్వరరెడి తదితరులు పాల్గొన్నారు.

డాన్ బాస్కో విద్యార్థుల వైజ్ఞానిక యాత్ర


చేపల పెంపకం గురించి వివరిస్తున్న అధికారి బెనర్జీ

వైరా: తల్లాడ మండలం రెడ్డిగూడెం సమీపంలోని డాన్‌బాస్కో పాఠశాల విద్యార్థులు గురువారం విజ్ఞాన యాత్రలో భాగంగా వైరాలోని మత్స్య విత్తన కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం లను పరిశీలించారు. పాఠశాలలోని విద్యార్థులకు సిస్టర్ కిరణ్, మిస్ అమల పలు విషయాలను వివరించారు. మత్స్య విత్తన కేంద్రంలో కార్యాలయ ఇన్‌చార్జ్ బెనర్జీ చేప పిల్లల ఉత్పత్తి ఆవశ్యకతను గురించి వివరించారు. విద్యార్థులు రిజర్వాయర్ పర్యాటక ప్రాంతాన్ని సందర్శించి సందడిగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ ప్రదీప్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

ఎర్రుపాలెం: ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితా ఎంపికలో పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం మినహాయింపు ఇవ్వాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బానోత్ శివుడు, కుమార్ గురువారం స్థానిక ఎంపీడీఓ సురేందర్‌కు వినతిపత్రం అందించారు. హరికృష్ణ, నాగిని, శ్రీలక్ష్మి, రామరాజు, అశోక్, హరిత, విజయలక్ష్మి, తదితరులున్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

సత్తుపల్లిరూరల్: సింగరేణి కార్మికులు సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరుతూ టీయూసీఐ జిల్లా నాయకుడు ఎ.శరత్ తెలిపారు. సత్తుపల్లి సింగరేణి ఓసీలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, శుక్రవారం ఇల్లెందులో జరిగే రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రసాద్, ఖాసీం, రవి, సురేష్, శ్రీహరి, నాగరాజు, జయరాజు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం విచ్ఛిన్నం



కె.మధుమోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిరూరల్: మాదక ద్రవ్యాలకు ఆకర్షితులై విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్‌ను విచ్ఛిన్నం చేసుకోవద్దని యాంటీ నార్కోటిక్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.మధుమోహన్‌రెడ్డి అన్నారు. గంగారం సాయి స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాల వాడకం చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం ఆయనను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యాంటి నార్కోటిక్స్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ వి.విజయరామారావు, సీఐ టి.కిరణ్, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి, డాక్టర్ కొండా రవికుమార్, శేఖర్‌బాబు, ఎన్ఎస్ఎస్ అధికారి సీతారాములు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు

సన్మానాలు..


ఎంపీడీఓ రామయ్య దంపతులను సన్మానిస్తున్న జెడ్పీ సీఈఓ దీక్షా రైనా

చింతకాని: అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని జెడ్పీ సీఈఓ దీక్షా రైనా పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో చింతకాని ఎంపీడీఓగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన రేబల్లి రామయ్యకు గురువారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదర్భంగా రైనా, తదితర విభాగాల అధికారులు.. రామయ్య దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఆర్.సన్యాసయ్య, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగపద్మజ, మండల ప్రత్యేకాధికారి, డీఎస్ఓ చందన్‌కుమార్, ఇరిగేషన్ డీఈ రాంప్రసాద్, ఈజీఎస్ ఏపీడీ శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి వీరపనేని శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి ఆల్తాఫ్, ఈజీఎస్ ఏపీఓ కోటయ్య, ఎంపీఓ పర్వీన్ ఖైసర్, డీటీ వీరభద్రనాయక్, ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ జానిమియా, యూడీసీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో గ్రాఫర్ల యూనియన్ సెక్రటరీకి..

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లికి చెందిన ఫొటో గ్రాఫర్ పిన్నం కనకారావు జిల్లా ఫొటోఅండ్ వీడియో గ్రాఫర్ల యూనియన్ ఎన్నికల్లో జిల్లా సెక్రటరీగా ఎన్నికయ్యారు. గురువారం సత్తుపల్లిలో జరిగిన కార్యక్రమంలో కనకారావును స్థానిక ఫొటోగ్రాఫర్లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాషా, సుమాంజలి రాము, వెంటేశ్వరరావు, సుబ్బారావు, కృష్ణ, గాంధీ, మారేష్, మూర్తి కిరణ్, నరేష్, ప్రభాస్ నర్సింహారావు, రాంబాబు, బాబి పాల్గొన్నారు.

వైద్యవృత్తి పవిత్రమైంది


సీహెచ్ఓ శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న డీఎంహెచ్ఓ కళావతి బాయి

బోనకల్: వైద్యవృత్తి ఎంతో పవిత్రమైందని, 42 సంవత్సరాల పాటు శ్రీనివాసరావు వైద్యవృత్తిలో అంకితబావంతో పనిచేశారని డీఎంహెచ్ఓ డాక్టర్ కళావతి బాయి అన్నారు. గురువారం సీహెచ్ఓ శ్రీనివాసరావు పదవీవిరమణ పొందడంతో మండలంలోని పీహెచ్‌సీలో వారి దంపతును శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నల్గొండ డీఎంహెచ్ఓ కొండల్‌రావు, సీపీఐ రాష్ట్రకమిటీ సభ్యుడె బాగం హేమంత్‌రావు, తహసీల్దార్ చందర్, ఏంఈఓ పుల్లయ్య, వైద్యాధికారిణి స్రవంతి, హెల్త్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు..

చింతకాని: తెలంగాణ ఉద్యమ గాన కోకిల రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికై న మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన బొడ్డు నరేష్‌ను బీజేపీ మండల నాయకులు గురువారం సన్మానించి జ్ఞాపికను అందజేశారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నాగేశ్వరరావు, గోపి పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణను సన్మానించిన వెంకట్

తల్లాడ: పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను హైదరాబాద్‌లో గురువారం రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు నారపోగు వెంకటేశ్వరరావు పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు. వర్గీకరణ కోసం రాష్ట్ర మంత్రుల ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ మాదిగ, నాయకుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరిపించాలి

బోనకల్: జిల్లా విద్యాశాఖాధికారి అక్రమాలపై విచారణ జరిపించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడు షేక్.యాకూబ్‌పాషా గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్‌లో నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. డీఈఓ తీరుపై రాష్ట్ర, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జిల్లాకు 36మంది స్పౌజ్ బదిలీల్లో 45మంది పరస్పర బదిలీల్లో ఖమ్మం జిల్లాకు వస్తే నేటికి వారికి నియామకపు ఉత్తర్వులు ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో సంఘ నాయకులు దేవసహాయం, సుజాత, నరసింహారావు పాల్గొన్నారు.

రేపు శివాలయంలో షాపుల వేలం

కల్లూరు: ఫిబ్రవరి 26న జరిగే మహాశివరాత్రిని పురస్కరించుకుని కల్లూరులోని శ్రీ కాశ్మీర మహాదేవ క్షేత్రం (కల్లూరు అప్పయ్య శివాలయం)లో మూడు రోజులపాటు జరిగే జాతరకు సంబంధించి పలు షాపుల వేలంపాట శనివారం ఉదయం 11 గంటలకు ఆలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ ఎస్‌వీడీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 25వ తేదీ నుంచి 27 తేదీ వరకు మూడు రోజల పాటు లడ్డూ ప్రసాదం పాట, మిఠాయి షాపులు, కొబ్బరి కాయల పాటలకు ఆసక్తి గలవారు ధరావత్తు రూ.10 వేలు చొప్పున కట్టి పాటలో పాల్గొనవచ్చన్నారు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 8179536850, 9505474358 లను సంప్రదించాల్సిందిగా ఆలయ మేనేజర్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి విద్యార్థికి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైయ్యాయి. వివరాల్లోకెళ్తే గ్రామానికి చెందిన సంతోష్ ముష్టికుంట్ల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. తన స్నేహితుడితో ద్విచక్ర వాహనంపై ఖమ్మం వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముష్టికుంట్ల శివారులో ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి ట్రాలీ ఆటోకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన సంతోష్‌ను 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు.

జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమం

ముదిగొండ: జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమం గురువారం నుంచి వచ్చే నెల 13వరకు చేపట్టనున్నట్లు ముదిగొండ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ అరుణాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అపోహలకు దూరంగా ఉండి, అవగాహన పెంచుకోవాలని సూచించారు. కుష్ఠువ్యాధి భారిన పడి, వెనుకబడి పోకుండా చూడాలని అన్నారు. ఈ వ్యాధి మైక్రో బాక్టీరియామ్ లేప్రే అనే బాక్టీరియా వలన వస్తుందని అన్నారు.

సాయినాధుడికి ప్రత్యేక పూజలు


శ్రీసాయి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లో సాయిబాబా ఆలయాల్లో సాయినాధుడికి గురువారం అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో భక్తులు భజనలు చేస్తు గీతాలను ఆలపించి బాబాని దర్శించుకోగా.. అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. మండలకేంద్రంలోని ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోళ్లను నిలిపివేసిన అధికారులు


కేజీ సిరిపురంలో రహదారిపై అరబోసిన ధాన్యం

వైరారూరల్: వానాకాలంలో సాగు చేసిన ధాన్యం కొనుగోళ్లను అధికారులు నిలిపివేశారు. ఈ నెల 31వ తేదిలోగా ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేసి కేంద్రాలను మూసి వేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో డీసీఎంఎస్ అధికారులు మిగిలిన ధాన్యం రాశులను ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన తర్వాతనే కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. దీంతో కేజీ సిరిపురం, విప్పలమడక గ్రామాల రైతులు తమ పంటను రోడ్ల మీద, కల్లాల్లో ఆరబోసుకోని విక్రయానికి సిద్ధంగా ఉంచగా.. ఇప్పుడు కేంద్రాలను మూసివేయడం ఎంటని, అధికారులే ఇప్పటి వరకు తేమశాతం పేరుతో పడిగాపులు కాయించి.. ఎప్పుడు కొనుగోళ్ల నిలిపివేయడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌కు తెలుపగా.. ఆయన డీసీఎంఎస్ అధికారులతో మాట్లాడారు. కొనుగోళ్ల మధ్యలో నిలిపివేస్తే రైతులకు నష్టం జరుగుతుందని నిబంధనల ప్రకారం మిగిలిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని సూచించారు. దాంతో అధికారులు ఉన్నతాధికారులతో మాట్లాడి కొనుగోళ్ల జరిగేలా చూస్తామన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం

మహాత్మా గాంధీ మార్గం అనుసరణీయమని పలువురు వక్తలు అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. పలు చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


సత్తుపల్లిటౌన్: గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి


సత్తుపల్లిరూరల్: బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న అసిస్టెంట్ కమాండెంట్ రంగారెడ్డి


మధిర: గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది